క్లుప్తంగా

సీసీరోడ్ల పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్ పవన్

వాంకిడి: మండలంలోని ఖమాన పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీరోడ్ల పనులను సర్పంచ్ పెందుర్ పవన్ శనివారం ప్రారంభించారు. బెస్తవాడలో రూ.5 లక్షలు, మెంగినేని వాడలో రూ.4 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉప సర్పంచ్ లలిత, పంచాయతీ కార్యదర్శి పోషం, వార్డు సభ్యుడు ఆనంద్‌రావు, ఎఫ్‌ఏ దేవిదాస్, బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని తుంపెల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యం కోసం సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కాగజ్‌నగర్ విశ్వశాంతి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు శనివారం రాత్రి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రిన్సిపాల్ లంక కృష్ణప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆలరించాయి. ఉపాధ్యాయులు ప్రసాద్, రవీందర్, రాధాకిషన్, రతన్, నాయకులు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆహారం అందించినట్లు సంస్థ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. సంస్థ సిబ్బంది గణపతి, రాకేశ్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : పులి

కాగజ్‌నగర్
వెంకటరమణ : పులి

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

\- ఆసిఫాబాద్‌అర్బన్

ఆరుబయట ఓపీ చీటీలు



గేటు వద్ద ఓపీ చీటీ రాస్తున్న సెక్యూరిటీ గార్డు



రోగులు లేక ఖాళీగా ఉన్న ఆసుపత్రిలోని వార్డు

- ఓపీ సేవల కోసం సెక్యూరిటీగార్డు వద్దకు..
- ఎండలో రోగుల పడిగాపులు
- సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి తీరిది
- సిబ్బంది ఉన్నా గార్డు చీటీలు రాయడంపై అనుమానాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు వైద్యులు లేక సకాలంలో రోగులకు వైద్యం అందని పరిస్థితి. మరోవైపు ఉన్నా సిబ్బంది రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆసుపత్రిలో ప్రతిరోజు ఓపీ సేవలతో పాటు అత్యవసర వైద్య చికిత్సల కోసం వందల సంఖ్యలో వస్తుంటారు. గతంలో ఆసుపత్రిలో ఓపీ చీటీలు రాసి వైద్యులు ఓపీ చూసిన తర్వాత మందులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం అరు బయట గేటు వద్ద రోగులకు సెక్యూరిటీ గార్డు ఓపీ చీటీలు రాసి ఇస్తున్నారు. ఇందుకోసం ఈ చీటీల కోసం సెక్యూరిటీ గార్డు వద్ద పడిగాపులు కాయల్సిన పరిస్థితి. వేసవిలో ఎండలు దంచి కొట్టడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న సిబ్బందితో కాకుండా సెక్యూరిటీ గార్డుతో చీటీలు రాయడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత

ఆసుపత్రిలో మొత్తం 17 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. అందులో ఒక వైద్యురాలిని కాగజ్‌నగర్‌లో నూతనంగా ఏర్పడ్డ సివిల్ ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై పంపించారు. 17 మందిలో ఇన్‌చార్జి డిప్యూటీ సివిల్ సర్జన్, ఇద్దరు జనరల్ డ్యూటీ డాక్టర్లు, ముగ్గురు వైద్యులు మాత్రమే విధుల్లో కొనసాగుతున్నారు. ఆసుపత్రిలో 14 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు పారా మెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో సెక్యూరిటీగార్డుల ద్వారా ఓపి చీటీలు రాయిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే ఎక్కడ పడితే అక్కడే ఓపీలు రాయడం, ఆరుబయట ఎండలో రోగులు వేచిచూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయమై ఆసుపత్రి ఇన్‌చార్జి డిప్యూటీ సివిల్‌సర్జన్ వైద్యాధికారి చెన్నకేశవులును సాక్షి సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు.

ఆరు బయట గేటు వద్దనే ఓపీ



ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్తే ఓపీ చీటీలు రాయించుకోవాలంటే గేటు వద్ద సెక్యూరిటీ గార్డు వద్ద క్యూలో ఉంటున్నాం. ఓపీ పేషంట్లు అధికంగా ఉంటే ఆరు బయట ఎండలో నిలబడి వేచి చూడాల్సి వస్తుంది. ఆరుబయట కాకుండా ఆసుపత్రి ఆవరణలో ఓపీ సేవలందించాలి.

\- బండ సంజీవ్, సిర్పూర్(టి)

వైద్యసేవలందించాలి



ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తున్నాం. ఇక్కడ వసతులున్నా సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదు. అత్యవసర సమయాల్లో ఇబ్బంది తప్పడంలేదు. నాణ్యమైన వైద్య సేవలందించాలి.

\- జి.పోశం, షేక్ అహ్మద్‌గూడ

సిబ్బంది కొరత ఉంది

వైద్యులు, ఇతర సిబ్బంది పూర్తి వివరాలు తనకు ఏమి తెలియదు. పారామెడికల్ సిబ్బంది కొరత విషయం తెలుసు. దీంతో ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది సెక్యూరిటీ గార్డుల ద్వారా ఓపీ చీటీలు రాయిస్తున్నాం.

\- జి.జోగేందర్, డ్యూటీ వైద్యుడు, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి, సిర్పూర్(టి)

కోతులతో పరేషాన్

- రోడ్లపై గుంపులుగా సంచారం
- ఇళ్లలో చొరబడి వస్తువులు ఎత్తుకెళ్తూ..
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



కౌటాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుంపులుగా సంచరిస్తున్న కోతులు

కౌటాల: అడవుల నుంచి కోతులు గ్రామాల బాట పడుతున్నాయి. అక్కడ ఆహారం, పండ్లు దొరకక పల్లెలకు చేరుతుండడంతో వానరాలు వీరంగం సృష్టిస్తున్నాయి. మండల కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో జనం భయపడుతున్నారు. చేతిలో వస్తువు పట్టుకుని రోడ్డుపై వెళ్లాలన్నా జంకుతున్నారు. ఇళ్లల్లో, కిరాణ దుకాణాల్లో చొరబడి అందిన కాడికి వస్తువులు లాక్కెళ్లి తింటున్నాయి. కూరగాయలు, పండ్లను ఎత్తుకెళ్తున్నాయి. కర్రలు పట్టి కోతులను బెదిరించి తరిమేస్తున్నారు. ఇలాంటి పనులు ప్రజలకు నిత్యకత్యంగా మారాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, సహకార సంఘం కార్యాలయాల ముందు ఉన్న చెట్లపై కోతులు బారులు తీరి ఉంటున్నాయి. కార్యాలయాలకు వచ్చిన వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కోతుల పరేషాన్‌తో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రజలపై దాడులు

కౌటాల–బెజ్జూర్ రహదారిపై వెళ్లే బైక్‌లపై వెళ్లేవారిని కోతులు వెంబడిస్తూ పరుగులు పెట్టిస్తున్నాయి. సంచిలో పండ్లు, కూరగాయలు చేతిలో కవరు పట్టుకుని రోడ్డు వెంట వస్తే కవర్లను లాక్కెళ్తున్నాయి. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడి చేయడంతో కింద పడి చేయి విరిగింది. మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీకి చెందిన ఓ మహిళ కోతుల దాడిలో గాయపడింది. కార్యాలయాల ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల సీటు కవర్‌ను చించేస్తున్నా యి. అదేవిధంగా వాహనాలపై గెంతులు వేస్తూ హంగామా చేస్తున్నాయి. కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని మండల వాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా వానరాలను పట్టుకుని అడువుల్లో వదిలి వేయాలని కోతున్నారు.



బైక్ సీటు కవర్‌ను చింపేస్తున్న కోతి

దాడి చేస్తున్నాయి

మండల కేంద్రంలో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్లపై వెళ్లేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాను. కార్యాలయం ముందు నా పై కోతి దాడిలో గాయపడ్డాను. అధికారులు కోతుల బెడద నుంచి విముక్తి కలిగించాలి.

\- డి.లూలాజీ, వీర్దండి

కోతుల బెడద నివారించాలి

కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. ఇళ్లలో చొరబడి వస్తువులను, కూరగాయాలను ఎత్తుకెళ్తున్నాయి. ఇంటి పై కప్పులు పగలగొడుతున్నాయి. కోతుల బెడద నివారించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి.

\- అల్లడి రవీందర్, కౌటాల

కళాశాల వార్షికోత్సవం



వాంకిడి: నృత్యం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద, బతుకమ్మ పాటలపై చేసిన విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందినవారికి ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్యలు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అంతకు ముందు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. సిబ్బంది చంద్రయ్య, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సత్యం, జాడి సంతోష్, అశ్విని పాల్గొన్నారు.



కౌటాల: నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

వీడ్కోలు సమావేశం

కౌటాల: కౌటాలలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫాదర్ టోమ్ థామస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

నార్నూర్: మండల కేంద్రంలో అన్నాభావుసాఠె విగ్రహం, స్వాగతం కమాన్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఆదివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్‌లు ప్రారంభోత్సవాన్ని హాజరవుతున్నట్లు సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ చౌక్ వద్ద మాట్లాడుతూ.. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్నాభావుసాఠె కమిటీ అధ్యక్షుడు కొర్రెల్ల మహేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావుదుర్గే, సభ్యులు డిగాంబర్, మాధవ్, నర్సింగ్‌మోరే పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

బెల్లంపల్లి: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని భారతీయ జనతా మహిళ మోర్చా రాష్ట్ర నాయకురాలు లావణ్య అన్నారు. స్థానిక అగర్వాల్ భవన్‌లో శనివారం మహిళ మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. అన్నిరంగాల్లోను పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మహిళలకు ఉన్నత అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. ప్రీతిని హత్య చేసిన వ్యక్తి ఓ రాష్ట్ర మంత్రి బంధువు కావడంతో ఆయనను కాపాడుతున్నారని, ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అనంతరం వివిధ రంగాల్లో విశేషసేవలు అందిస్తున్న మహిళ నాయకురాళ్లు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు సువర్ణ, నాయకులు తిరుపతి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కోడి పందేలు..!

- శివారు ప్రాంతాల్లో నిర్వహణ
- నామమాత్రంగా పోలీసుల దాడులు
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు



కోడి పుంజులు

కౌటాల: మండలంలోని శివారు ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా సాగుతోంది. కొందరు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. ప్రతి వారం భారీ ఎత్తున నిర్వహిస్తున్నారని సమాచారం. పలు ప్రాంతాల్లో పోలీసులు ఆడప దడపా దాడులు చేస్తూ నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు కోడి పందేలు నిర్వహించడానికి పోలీసులు, జన సంచారం లేని స్థలాలు గుర్తించి స్థానికుల సాయంతో పరిశీలిస్తారు. ఆ తర్వాత బెట్టింగ్ రాయుళ్లను ఒకచోటుకు తీసుకువస్తారు. ఎవరైన వస్తే తప్పించుకునేందుకు పథక రచనలు ఉంటాయి. కోడి పందెల నిర్వహణపై నిషేధం ఉందని, జంతుహింస నిరోధక చట్టం 1960 ప్రకారం సెక్షన్–11 కింద కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సంఘటనలు ఇలా..

- గత జనవరి 14న సాండ్‌గాం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. 9 మందిని అదుపులో తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.6 వేల నగదు, 2 కత్తులు, 2 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 7న కన్నెపల్లి సమీపంలో కోడి పందేల నిర్వహిస్తున్నారని సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురి పై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు, రెండు పందేం కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సిర్పూర్(టి): అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ బీట్ అధికారి సంతోష్ అన్నారు. మండలంలోని చీలపెల్లి గ్రామంలో అడవుల సంరక్షణ, బాధ్యత పలు అంశాలపై గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అడవుల్లో మంటలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అటవీప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్‌కు కనెక్షన్లు వేసి వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమన్నారు. సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య యాదవ్ పాల్గొన్నారు.

సీఐ స్వామిని కలిసిన విశ్రాంత ఉద్యోగులు



స్వామిని సన్మానిస్తున్న విశాంత్ర ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ సీఐ (ఇన్‌స్పెక్టర్)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బుద్దే స్వామిని తెలంగాణ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను సీఐ దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించి పోలీస్ శాఖ తరపున పరిష్కరిస్తామని హామీఇచ్చారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల విషయంలో వివరించారు. సంఘం అధ్యక్షులు ఎం.జయదేవ్ అబ్రహం, పదాధికారులు ఎఎస్ఆర్ మూర్తి, శివప్రసాద్, నారాయణ, బర్నబాస్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులుగా నిలిచిన ఉపాధి పనులు

తిర్యాణి: ఉపాధి హామీ పథకంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చినప్పటి నుంచి కూలీ లకు అనేక చిక్కులు ఏర్పడుతున్నాయి. తాజాగా కొత్త సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సర్వర్ పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ హాజరు గత రెండు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాలల్లో పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ఉపాధి పనులను చేసినప్పటికి సర్వర్ డౌన్ ఉండటంతో హాజరుపడలేదు. కాగా ఇదే అంశంపై ఉన్నతాధికారులు అన్ని మండలాల ఏపీవోలతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. సర్వర్ సంబంధించిన సమస్యను పరిష్కరించి యథావిధిగా ఉపాధి కల్పించాలని కూలీలు కోరుతున్నారు.



మోడు వారినా అందమే

కెరమెరి(ఆసిఫాబాద్): దట్టంగా ఉండే అడవులు ఇప్పడు పలచగా మారి, తన అందాన్ని కోల్పోయాయి. ఆకులన్నీ రాలి అందవిహీనంగా మారాయి. దీంతో వట్టి కొమ్మలకే పరిమితమయ్యాయి. ఎల్లప్పుడు తమ అందాన్ని..స్వచ్ఛమైన గాలిని ఇచ్చే వృక్షాలు తన వాస్తవికతను కోల్పోయాయి. మండలంలోని పాటాగూడ, చాల్‌బాడికి వెళ్లేదారిలో అభయారణ్యాల చిత్రాలు ఇవి.



